సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం : 15 : మార్చి : 2023



చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి. మార్కెట్‌కు 669 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.13

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.7 పలికినట్లు అధికారులు తెలిపారు.



జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఉదయం పూట చాలా ప్రాంతాల్లో చలి వాతావరణం కొనసాగింది. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

17న పీహెచ్‌డీ స్పాట్ అడ్మిషన్లు



అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం)లో ఏపీ రీసెట్ కౌన్సెలింగ్‌లో మిగిలిన పీహెచ్‌డీ సీట్లను ఈ నెల 17న స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ బి.ఈశ్వరరెడ్డి తెలిపారు. ఏపీ రీసెట్–2022లో అర్హత సాధించి, సంబంధిత పీజీలో ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలను తీసుకుని వర్సిటీ పాలకభవనంలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలు www.jntua.ac.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవాలన్నారు.

19న జిల్లా స్థాయి ఎంపిక పోటీలు



కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 19న స్కూల్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ యాక్టివిటీస్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, కార్యదర్శి రామచంద్ర తెలిపారు. అండర్ 14, 16, 19 విభాగాల్లో క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్, హ్యాండ్ బాల్, కరాటే, టెన్నిస్, త్రోబాల్, కరాటే , ఖోఖో, చెస్ తదితర క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆధార్‌కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని 19వ తేదీ ఉదయం క్రీడామైదానం వద్దకు రావాలని సూచించారు. వివరాలకు 8374775227 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

బీఫార్మసీ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) పరిధిలో ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన బీఫార్మసీ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–19, ఆర్–15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం జేఎన్‌టీయూ వెబ్‌సైట్ www. jntua.ac.in ను సందర్శించాలని సూచించారు.

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

- ఆల్బెండజోల్ మాత్రల పంపిణీలో కలెక్టర్ బసంత్‌కుమార్



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి టౌన్: అందరం కలిసి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని కలెక్టర్ బసంత్ కుమార్ పిలుపునిచ్చారు. ఇందుకు విద్యార్థి దశ నుంచే ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి జిల్లా పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, సాయి సనాతన మాంటిస్సోరీ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్యసూత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బసంత్ కుమార్ మాట్లాడుతూ... విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందన్నారు. ఈ క్రమంలోనే నులిపురుగుల నివారణకు ప్రతి ఆరునెలలకు ఒకసారి 1 నుంచి 19 ఏళ్ల లోపు వయస్సున్న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, నులిపురుగుల నివారణ శాఖ అధికారి డాక్టర్ నివేదిత, ఫణీంద్ర, జ్యోత్స్న, సీడీపీఓ గాయత్రి, సూపర్‌వైజర్ లక్ష్మన్న, ఎంఈఓ వెంకటరమణ నాయక్, సీహెచ్‌ఓ నగేష్, కౌన్సిలర్ సరస్వతి, హెచ్‌ఎం మోహన్‌బాబు, వైద్య సిబ్బంది పరిమళ, అజీజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రేపే కౌంటింగ్



జేఎన్‌టీయూ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కౌంటింగ్ సిబ్బంది

- ఏర్పాట్లు కట్టుదిట్టం
- పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు 24 టేబుళ్లు
- ఉపాధ్యాయ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు
- ప్రక్రియ నిర్వహణకు 568 మంది సిబ్బంది
- ఇతర ఏర్పాట్లకు 91 మంది నియామకం

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో చివరి అంకం... అభ్యర్థుల భవితవ్యం తేల్చనున్న ఓట్ల లెక్కింపు ఘట్టం ఈనెల 16న నిర్వహించనున్నారు. జేఎన్‌టీయూ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పకడ్బందీగా చేస్తోంది. ఆరు జిల్లాల బ్యాలెట్ పెట్టెలను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. పట్టభద్ర, ఉపాధ్యాయ ఓట్ల లెక్కింపునకు 568 మంది సిబ్బందిని నియమించారు. ప్రక్రియ నిర్వహణ, ఇతర ఏర్పాట్ల పర్యవేక్షణకు 91 మంది అధికారులు, సిబ్బందిని కేటాయించారు.

లెక్కింపునకు మూడు బ్యాచ్‌లు

పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు మూడు బ్యాచ్‌లను ఏర్పాటు చేశారు. మొదటి బ్యాచ్ గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు లెక్కింపు నిర్వహిస్తుంది. రెండవ బ్యాచ్ సాయంత్రం 4 నుంచి రాత్రి 12 గంటల వరకు పని చేస్తుంది. మూడవ బ్యాచ్ రాత్రి 12 నుంచి ఉదయం 8 గంటల వరకు లెక్కింపు చేపడుతుంది.

- ఇక ఉపాధ్యాయ ఓట్ల లెక్కింపునకు రెండు బ్యాచ్‌లు పనిచేస్తాయి. మొదటి బ్యాచ్ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, రెండవ బ్యాచ్ సాయంత్రం 4 నుంచి రాత్రి 12 గంటల వరకు నిర్వహిస్తుంది.

38 టేబుళ్ల ఏర్పాటు

పట్టభద్ర ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు 24 టేబుళ్లు, ఉపాధ్యాయ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు మొత్తం 38 ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు, నిర్వహణ ఇన్‌చార్జ్‌లు, ఇతర ఏర్పాట్ల కోసం 659 మంది అధికారులు, సిబ్బందిని నియమించారు. ఓట్ల లెక్కింపునకు టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ముగ్గురు సహాయకులు, ఒక సూక్ష్మ పరిశీలకుడు (బ్యాంక్ అధికారులు), ఒక అటెండర్ ఉంటారు. ఈ క్రమంలో పట్టభద్రుల ఓట్ల లెక్కింపు కోసం 24 టేబుళ్లకు మూడు బ్యాచ్‌లకు 392 మంది సిబ్బందిని, రిజర్వులో తొమ్మిది మంది మొత్తం 401 మందిని నియమించారు.

- ఉపాధ్యాయ ఓట్ల లెక్కింపునకు 158 మంది సిబ్బందిని, రిజర్వులో తొమ్మిది మందిని మొత్తం 167 మందిని నియమించారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో సిబ్బందికి భోజన వసతి, వాహనాల పార్కింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో రో ఇన్‌చార్జ్‌లు, స్ట్రాంగ్ రూమ్ ఇన్‌చార్జ్‌లు, బ్యాలెట్ కట్టల మిక్సింగ్ ఇన్‌చార్జ్‌లు, రౌండ్ వారీగా ఫలితాల పర్యవేక్షణకు, నివేదిక సమర్పణ, బ్లాక్‌బోర్డ్ ఇన్‌చార్జ్.. ఇలా వివిధ పనులకు 91 మంది అధికారులను, సిబ్బందిని నియమించారు.

బ్యాలెట్ బాక్సులు భద్రం

పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లోని అనంతపురం జిల్లా బ్యాలెట్ బాక్స్‌లు పోలింగ్ రోజైన 13వ తేదీనే జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. ఇక , శ్రీ సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల బ్యాలెట్ పెట్టెలను పోలీసు బందోబస్తుతో మంగళవారం జేఎన్‌టీయూకు తీసుకొచ్చారు. వాటిని జిల్లాల వారీగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చారు. బ్యాలెట్ పెట్టెలు ఉంచిన స్ట్రాంగ్ రూమ్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్‌ఓ గాయత్రీదేవి పరిశీలించారు. అనంతరం ఆ గదులకు సీల్ వేయించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట బందోబస్తు, నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

పశ్చిమ రాయలసీమ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓట్లు...	
పట్టభద్రుల ఓట్లు	3,30,124
పోలైన ఓట్లు	2,45,103
లెక్కింపునకు టేబుళ్లు	24
లెక్కింపునకు బ్యాచ్‌లు	3
లెక్కింపునకు సిబ్బంది	401
ఉపాధ్యాయ ఓట్లు	28,148
పోలైన ఓట్లు	25,884
లెక్కింపునకు టేబుళ్లు	14
లెక్కింపునకు బ్యాచ్‌లు	2
లెక్కింపునకు సిబ్బంది	167



స్ట్రాంగ్ రూమ్‌లో బ్యాలెట్ పెట్టెలను తనిఖీ చేస్తున్న అనంతపురం కలెక్టర్ నాగలక్ష్మి

అప్రమత్తంగా విధులు

అనంతపురం అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు విధుల్లో సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. మంగళవారం జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు పరిశీలకులు పోలా భాస్కర్, హరిజవహర్‌లాల్ ఓట్ల లెక్కింపులో చెల్లని ఓట్లను గుర్తించడం, ప్రాధాన్యతా ఓట్లను అభ్యర్థులకు బదిలీ చేయడం, విజేతను ప్రకటించడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ రెండు నుంచి మూడు రోజులు పట్టొచ్చని, ఇందుకు అనుగుణంగా సిబ్బంది మానసికంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. సిబ్బందికి అనుకూలంగా ఉండేందుకు మూడు షిఫ్టులుగా కౌంటింగ్ నిర్వహించనున్నామన్నారు. అభ్యర్థులు తమ కౌంటింగ్ ఏజెంట్లను షిఫ్టుల వారీగా నియమించుకోవాలని సూచించారు.

భానుడి భగభగలు

- 40 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు



అనంతపురం అగ్రికల్చర్: భానుడి భగభగలు మొదలయ్యాయి. వేసవి ఆరంభంలో పగటి ఉష్ణోగ్రతలు అదిరేలా నమోదవుతున్నాయి. మరోపక్క ఉదయం పూట అక్కడక్కడ చలి వాతావరణం కొనసాగుతున్నా... 10 గంటలయ్యే సరికి సూరీడు ప్రతాపం చూపిస్తున్నాడు. సీజన్‌లో తొలిసారిగా మంగళవారం చాలా మండలాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువగా నమోదయ్యాయి. గుంతకల్లులో 39.7 డిగ్రీల మేర అధిక ఉష్ణోగ్రత నమోదు కాగా.. తాడిపత్రి, కళ్యాణదుర్గం, యల్లనూరు, కూడేరు, గుత్తి, పామిడి తదితర మండలాల్లో కూడా 39 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. అటు శ్రీసత్యసాయి జిల్లాలో కూడా పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. పరిగి, తాడిమర్రి, చెన్నేకొత్తపల్లి, రామగిరి, కొత్తచెరువు, ముదిగుబ్బ, తనకల్లు, అమడగూరు తదితర మండలాల్లో 38 నుంచి 39 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. మధ్యాహ్న సమయంలో వేసవి తాపం అధికంగా కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు 35 నుంచి 39 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 15 నుంచి 20 డిగ్రీల మధ్య రికార్డయ్యాయి. మార్చి రెండో వారంలోనే 40 డిగ్రీలకు చేరువ కావడంతో ఏప్రిల్, మే మాసాల్లో తీవ్రత అధికంగా ఉండవచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. వచ్చే రెండు నెలలూ చాలా మండలాల్లో 42 నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదుకావచ్చని అంచనా వేస్తున్నారు.

బాగా చదవాలి.. తల్లిదండ్రులకు పేరు తేవాలి



విద్యార్థి సారికాబాయితో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి

కదిరి అర్బన్: బాగా చదివి పదో తరగతిలో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి పదో తరగతి విద్యార్థులకు సూచించారు. సోమవారం రాత్రి ఆమె 'నైట్ విజన్' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మంచి మార్కులు సాధించేందుకు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రణాళికా బద్ధంగా చదువుకుంటే పదో తరగతిలో మంచి మార్కులు సాధించవచ్చన్నారు. అలాగే విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం పలు విద్యార్థుల గృహాలను సందర్శించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శాంతమ్మ, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాన్ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. శ్రీవారి అలుకోత్సవం

కదిరి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి అలుకోత్సవం మంగళవారం నేత్రపర్వంగా సాగింది. అనంతరం స్వామి వారు అశ్వవాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. చతురంగ బలాలలో అత్యంత ప్రధానమైనది అశ్వ బలం . కలియుగాంతంలో శ్రీవారు అశ్వ వాహనంపై వచ్చి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేస్తాడని చాటి చెప్పడం కోసమే నారసింహుడు అశ్వవాహనంపై ఊరేగుతారని వేద పండితులు వివరించారు. యాగశాలలో నిత్యహోమం తర్వాత శ్రీవారు విశేషాలంకరణతో ఆలయానికి సమీపంలోని సుద్దుల మండపం వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడికి చేరుకున్న భక్తులు 'శ్రీ ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి గోవిందా..గోవింద' అంటూ నామస్మరణ చేశారు. ఆలయ సహాయ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ దంపతులు శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అన్ని ఉత్సవాలకు ఉభయదారులుగా భక్తులు వ్యవహరిస్తే.. అలుకోత్సవానికి మాత్రం ఆనవాయితీ ప్రకారం ఆలయ సహాయ కమిషనర్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అలుకోత్సవంలో ఆలయ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ, పాలక మండలి సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు తీర్థవాది : ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు ఫాల్గుణ శుద్ధ దశమి నాడు (ఈ నెల 2వ తేదీ) అంకురార్పణంతో ప్రారంభమైన విషయం విదితమే. ఈ ఉత్సవాలు ఫాల్గుణ బహుళ నవమి నాడు అంటే గురువారం పుష్పయాగోత్సవంతో ముగియనున్నాయి. బుధవారం స్వామివారి తీర్థవాది ఉత్సవం భృగుతీర్థం(కోనేరు)లో భక్తుల కోలాహలం నడుమ నిర్వహించనున్నారు.



శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఈఓ, చైర్మన్ కుటుంబ సభ్యులు



విశేషాలంకరణలో శ్రీవారు

విద్యార్థికి రాగిజావ!

'జగనన్న గోరుముద్ద'లో చేర్చిన సర్కార్

- చిన్నారులకు ఇక మెరుగైన పౌష్టికాహారం
- 21 నుంచి పాఠశాలల్లో పంపిణీకి చర్యలు
- చౌకదుకాణాల ద్వారా ప్రతి నెలా సరఫరా
- ఇప్పటికే పాఠశాలలకు చేరిన రాగిపిండి, పొడి బెల్లం
- జిల్లాలో 1,61,343 మంది విద్యార్థులకు లబ్ధి



రాగిజావ



చౌక దుకాణాల ద్వారా సరఫరా చేసిన రాగిపిండి ప్యాకెట్

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మరింత మెరుగైన పౌష్టికాహారం అందించేందుకు జగన్ సర్కార్ సిద్ధమైంది. ఇందులో భాగంగా 'జగనన్న గోరుముద్ద'పేరుతో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం మెనూలో అదనంగా రాగి జావను చేర్చింది. ఫైబర్, మినరల్స్, అమినో ఆమ్లాలు, క్యాల్షియం, మెగ్నీషియం, విటమిన్ బి అధికంగా ఉండే రాగిజావ ఇవ్వడం వల్ల విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు ఆలోచనా శక్తి మరింత పెరుగుతుందని భావిస్తోంది. ఈ మేరకు ఈ నెల 21వ తేదీ నుంచి పాఠశాలల్లోని విద్యార్థులకు రాగి జావ అందించేందుకు చర్యలు చేపట్టింది.

సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ద్వారా...

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాఠశాలలకు రాగిజావ అందించేలా రాష్ట్ర ప్రభుత్వం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు ఫిబ్రవరి 9న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విజయవాడలో కలిసి రాగిజావకు సంబంధించి ఎంఓయూపై సంతకాలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 44,392 ప్రభుత్వ పాఠశాలల్లోని 38 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా రాగిజావ అందజేయనున్నారు.


జిల్లాలోని 1.61 లక్షల మందికి..

'జగనన్న గోరుముద్ద' ద్వారా రోజూ మధ్యాహ్నం ఇప్పటికే నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం దీనికి అదనంగా రాగిజావ చేర్చింది. వారంలో మూడు రోజులు రోజుమార్చి రోజు ప్రతి విద్యార్థికీ ఒక గ్లాసు రాగి జావ ఉదయం వేళల్లో అందించనుంది. ఈక్రమంలో జిల్లాలో 1,553 ప్రాథమిక పాఠశాలల్లోని 51,330 మంది, 230 ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 20,125 మంది, 306 ఉన్నత పాఠశాలల్లోని 89,888 మంది కలిపి 2,089 పాఠశాలల్లోని 1,61,343 మంది విద్యార్థులకు రాగిజావ అందనుంది.

చౌక దుకాణాల ద్వారా సరఫరా..

రాగిజావకు అవసరమైన రాగిపిండి, పొడి బెల్లం 5 కిలోల చొప్పున ప్యాక్ చేసి ఇప్పటికే జిల్లాలోని 1,083 చౌక దుకాణాలకు చేర్చింది. వాటిని ఆయా ప్రభుత్వ పాఠశాలలకు సైతం సరఫరా చేశారు. రాగిపిండి, పొడి బెల్లంలో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్స్, ఐరన్, క్యాల్షియం ఉంటాయి. దీంతో పిల్లలకు మరింత మెరుగైన పౌష్టిహాకారం అందుతుంది. తద్వారా అనారోగ్య సమస్యలు తగ్గి రోజూ పాఠశాలకు హాజరై విద్యాభ్యాసం కొనసాగిస్తారు. రాగి మాల్ట్‌ను ప్రతి మంగళవారం, గురువారం, శనివారాల్లో ఉదయం 8.45 గంటలకు పిల్లలకు పంపిణీ చేయాలి. రోజూ మధ్యాహ్నం రెండు గంటలకు విద్యాశాఖ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

పాఠశాలలకు చేర్చాం



'జగనన్న గోరుముద్ద'పథకం కింద అందజేయనున్న రాగి జావ కోసం సర్వం సిద్ధం చేశాం. పొడి బెల్లం, రాగిపిండిని పటిష్టమైన బ్యాగ్‌లలో 5 కిలోల చొప్పున ప్యాక్ చేసి చౌకదుకాణాల నుంచి పాఠశాలలకు సరఫరా చేశాం. ప్రతి నెలా ఇదే విధంగా చౌక దుకాణాల ద్వారా అందజేస్తాం.

– అశ్వర్థనారాయణ నాయక్, మేనేజర్, జిల్లా పౌరసరఫరాల శాఖ

దివ్యాంగుడి బలవన్మరణం

చిలమత్తూరు: దివ్యాంగుల ట్రస్ట్‌లో ఆశ్రయం పొందుతున్న ఓ యువకుడు జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దం మండలం నారనాగేపల్లికి చెందిన నరసింహులు కుమారుడు గోపాలకృష్ణ (32)కు చూపు సరిగా లేదు. దీనికి తోడు వినికిడి లోపం కూడా ఉంది. ఈ నేపథ్యంలో చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టు వద్ద ఉన్న దివ్యాంగుల సమర్థనం ట్రస్ట్‌లో కంప్యూటర్ కోర్సు అభ్యసించేందుకు ఇటీవల చేరాడు. తన వైకల్యం కారణంగా కోర్సులోని అంశాలు అర్థం కాక ఇబ్బంది పడుతూ వచ్చిన గోపాలకృష్ణ.. జీవితంపై విరక్తితో మంగళవారం బాత్‌రూంలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ట్రస్ట్ నిర్వాహకుల నుంచి సమాచారం అందుకున్న మృతుడి కుటుంబీకులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. గోపాలకృష్ణ తండ్రి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

భార్యాకూతుళ్లపై పెట్రోలు పోసి నిప్పు

- ఇల్లాలిపై అనుమానంతో ఓ భర్త ఘాతుకం
- భార్య మృతి, పిల్లలకు తీవ్ర గాయాలు
- తుమకూరు జిల్లాలో పరిగి మండల వాసి కిరాతకం


భార్యాపిల్లలతో నిందితుడు రామాంజి (ఫైల్)

పరిగి/తుమకూరు: అర్ధరాత్రి నిద్రపోతున్న సమయంలో భగభగమంటూ మంటలు. చుట్టూ చీకటి. తలుపు తీసి తప్పించుకుందామంటే బయట తాళం వేసి ఉంది. మంటలు చుట్టుముడుతుంటే పిల్లలను కాపాడేందుకు తల్లి పక్కగదిలోకి వెళ్లింది. చూస్తుండగానే తల్లి కాలి బూడిదైంది. పిల్లలూ తీవ్ర కాలిన గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. ఘటనకు బాధ్యుడు ఆ పసిబిడ్డల తండ్రే కావడం గమనార్హం. ఈ అమానుష సంఘటన తుమకూరు జిల్లా మధుగిరి తాలూకా ముద్దనెరళెకెరె గ్రామంలో చోటు చేసుకుంది.

అనుమానం పెనుభూతమై..

పరిగి మండలం బీచిగానిపల్లికి చెందిన రామాంజికి కర్ణాటకలోని మధుగిరి తాలూకా ముద్దనెరళెకెరె గ్రామానికి చెందిన శాంతమ్మతో 17 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి 7 నుంచి 12 ఏళ్ల మధ్య వయసున్న ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. వివాహమైన తర్వాత శాంతమ్మతో కలసి ముద్దనెరళెకెరె గ్రామంలోనే రామాంజి స్థిరపడ్డాడు. ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో 8 నెలల క్రితం స్కూల్ బస్సును ప్రమాదానికి గురి చేయడంతో రెండు నెలల జీతంలో యాజమాన్యం కోత విధించింది. దీంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఆ సమయంలో తాను ఇంట్లో దాచుకున్న డబ్బుతో కుటుంబాన్ని శాంతమ్మ నెట్టుకొచ్చింది. దీంతో శాంతమ్మ ప్రవర్తనపై రామాంజిలో అనుమానాలు రేకెత్తాయి. ఇది కాస్త పెనుభూతంగా మారింది.

రూ.500 లెక్క తేలాలంటూ..

ఆదివారం రాత్రి శాంతమ్మ దగ్గర రూ.500 ఉండడం గమనించిన రామాంజి.. ఆ డబ్బు ఎలా వచ్చిందంటూ నిలదీశాడు. అనుమానంతో అనరాని మాటలు అన్నాడు. అన్నింటినీ శాంతమ్మ మౌనంగా భరించింది. ఇది అతనిలోని మృగాన్ని నిద్రలేపినట్టైంది. సోమవారం వేకువజాము 3 గంటల సమయంలో నిద్రిస్తున్న భార్యపై పెట్రోలు పోసి నిప్పంటించాడు. ఆ సమయంలో తల్లి పక్కనే నిద్రిస్తున్న పిల్లలపై కూడా పెట్రోల్ పడడంతో వారికీ మంటలు వ్యాపించాయి. వెంటనే ఇంటి నుంచి బయటకు వచ్చిన రామాంజి తలుపునకు బయటి నుంచి గొళ్లెం పెట్టి అక్కడి నుంచి పారిపోయాడు. మంటలు చుట్టుముట్టడంతో శాంతమ్మ పిల్లలను వదిలి పక్క గదిలోకి చేరుకుని కుప్పకూలిపోయింది. చిన్నారుల ఆర్తనాదాలతో నిద్రలేచిన చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని తాళం బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి, మంటలు ఆర్పివేశారు. అప్పటికే శాంతమ్మ మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన ముగ్గురు కుమార్తెలను తుమకూరు జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఓ బాలికను వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న బాలికల్లో ఒకరు మృత్యువాత పడినట్లు సమాచారం.

నిందితుడి అరెస్ట్

భార్యాపిల్లలకు నిప్పంటించిన తర్వాత రామాంజి నేరుగా అక్కడి నుంచి ద్విచక్ర వాహనంపై తన సొంతూరు బీచిగానిపల్లికి వచ్చి, వాహనాన్ని తన చిన్నాన్న శివప్ప ఇంటి వద్ద నిలిపాడు. అనంతరం జరిగిన ఘటనను బంధువులు, స్నేహితులకు తెలిపి తనను కొన్ని రోజుల పాటు దాచి ఉంచాలని కోరాడు. ఇందుకు ఎవరూ సమ్మతించకపోవడంతో వెంటనే పెనుకొండ మండలం మావటూరులో ఉన్న స్నేహితుడిని కలిసేందుకు బయలుదేరాడు. అప్పటికే నిందితుడి కదలికలను పసిగట్టిన మిడిగెశి పోలీసులు బీచిగానిపల్లికి మంగళవారం చేరుకుని శివప్పను, అతని కుమారుడు ఈశ్వర్‌ను తమదైన శైలిలో విచారణ చేయడంతో రామాంజి మావటూరుకు వెళ్లినట్లుగా తెలిసింది. దీంతో కర్ణాటక పోలీసులు వెంటనే మావటూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలో సోమందేపల్లి మండలం బ్రాహ్మణపల్లి పరిసరాల్లో నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసి, తమ ప్రాంతానికి తరలించారు.

విజయీభవ

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ప్రశాంతి నిలయం: బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలుంటాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష సమయం ఉంటుంది. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో 39 కేంద్రాల్లో 21,895 మంది హాజరు కానున్నారు. వీరిలో జనరల్ విద్యార్థులు 19,459 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,436 మంది ఉన్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. పరీక్ష కేంద్రాల్లో ప్రతి గదిలోనూ సీసీ కెమెరా అమర్చారు. చీఫ్ సూపరింటెండెంట్ సమక్షంలో ప్రశ్నపత్రం ఓపెన్ చేస్తారు. విద్యార్థులకు ఏ చిన్న సమస్య తలెత్తినా కంట్రోల్ రూంలోని 08554-277626 నంబరుకు ఫిర్యాదు చేయొచ్చని ఆర్‌ఐఓ సురేష్‌బాబు తెలిపారు. పరీక్ష కేంద్రంలో ఏ స్థాయి అధికారి వద్ద కూడా సెల్‌ఫోన్ ఉండకూడదు. రాష్ట్ర స్థాయి అధికారుల పర్యవేక్షణ కోసం, సమాచారం తెలుసుకునేందుకు చీఫ్ సూపరింటెండెంట్లు ప్రత్యేక కీప్యాడ్ ఫోన్లు వినియోగించేలా ఉత్తర్వులు ఇచ్చారు. ఇవి కూడా నేరుగా బోర్డు నుంచే సరఫరా చేశారు. సిమ్‌కార్డులు కూడా వారే పంపారు. బోర్డు పంపిన సెల్‌ఫోన్లు సీఎస్‌ల వద్ద తప్ప మరెవరివద్దా కనిపించకూడదని ఆర్‌ఐఓ తెలిపారు.

15 మంది విద్యార్థుల డీబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్న 15 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. అనంతపురంలో పది మంది, గుంతకల్లులో ముగ్గురు, కదిరి, తాడిపత్రిలో ఒక్కరు చొప్పున విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడినట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి హత్య

పావగడ: వైఎన్ హొసకోట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రబెట్ట గ్రామ సమీపంలో ప్రధాన రోడ్డు పక్కన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు మంగళవారం గుర్తించారు. డీఎస్పీ వెంకటేశులు, ఎస్‌ఐ అర్జున్‌గౌడ్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. వ్యక్తిని మరో ప్రాంతంలో హతమార్చి ఇంద్రబెట్ట పరిసరాల్లో పడేసి, గుర్తు పట్టకుండా ఉండేందుకు పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తి హత్య కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అర్.ఓ.సి. నెం. 300/2013-ఎ1 తేది : 14-03-2023

బహిరంగ వేలము ప్రకటన

హిందూపురం పురపాలక సంఘ పరిధిలోని ఈ క్రింద కనబరచిన అంశములకు 2023-2024 ఆర్థిక సంవత్సరములో ఆశీలు వసూలు చేసుకొను హక్కులను కమిషనరు గారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని ది : 21-03-2023 మంగళవారం ఉదయం 11-00 గంటలకు మున్సిపల్ కార్యాలయములో బహిరంగ వేలము వేయబడును. వేలంలో పాల్గొనదలచినవారు సదరు అంశములకు ఎదురుగా సూచించిన ధరావత్తు మొత్తమును చెల్లించి, హిందూపురము మున్సిపల్ కమిషనర్ గారిచే గాని లేదా హిందూపురం తహశీల్దార్ వారిచే గాని కొత్తగా జారీ చేయబడిన, నిర్దేశించబడిన సాల్వెన్సీ సర్టిఫికేట్‌తో పాటు ఆధార్ కార్డు నకలుతో అర్జీని దాఖలు చేయవలయును. 2023-2024 గెజిట్ నోటిఫికేషన్‌లోని షరతులను అంగీకరించిన సవాలు దారులు డిపాజిట్ మొత్తములను నగదుగా చెల్లించిన వారు మాత్రమే వేలములో పాల్గొనవచ్చును. ఇతర వివరములకు కార్యాలయము పనిదినములలో తెలుసుకొనవచ్చును. ఏ కారణం తెలుపకనే వేలం వాయిదా వేయుటకు గాను / రద్దు పరచుటకు గాను మున్సిపల్ కమిషనర్ గారికి పూర్తి అధికారములు కలిగియుండును.

లీజు కాల వ్యవధి 01-04-2023 నుండి 31-03-2024 వరకు

వరుస నెం.	లీజు వివరములు	వేలములో పాల్గొనుటకు ముందుగా చెల్లించవలసిన నగదు డిపాజిట్ మొత్తము రూపాయలు	వేలములో పాల్గొనుటకు ముందుగా దాఖలు పరచవలసిన సాల్వెన్సీ సర్టిఫికెట్ మొత్తము రూపాయలు
1	2	3	4
1.	మునిసిపల్ దినసరి కూరగాయల మార్కెట్ (పెద్ద మార్కెట్) మరియు రోడ్ మార్జిన్లపై అమ్ముకొను వస్తువులపై ఫీజు వసూలు చేసుకొను హక్కు	15,00,000/-	50,00,000/-
2.	చిన్న పశువులు వాటి తోళ్ళ మార్కెట్	6,00,000/-	6,00,000/-
3.	పెద్ద పశువులు వాటి తోళ్ళ మార్కెట్	1,50,000/-	5,00,000/-
4.	పరిగి బస్టాండు ఆవరణములోని ఖాళీ స్థలము (60X40 చ॥మీ)	8,00,000/-	10,00,000/-

షరతులు : 1) బహిరంగ వేలంలో పాల్గొనదలచిన పాటదారులు సాల్వెన్సీ సర్టిఫికేటును దాఖలు పరచవలెను. 2) వేలంలో పాల్గొనదలచినవారు వారికి సంబంధించిన 2022-2023 సం॥నకు చెందిన ఇంటి పన్నులు, నీటి చార్జీలు, D & OT లైసెన్స్ ఫీజులు మరియు ఇతర పన్నులు పూర్తిగా చెల్లించిన రసీదులు జతపరచవలయును. 3) వేలంలో పాల్గొనదలచిన వారు సాల్వెన్సీ సర్టిఫికెట్‌లను ది. 20-03-2023 సాయంత్రము 5-00 గంటలలోపు అర్జీతో పాటు మునిసిపల్ ఆఫీసులో దాఖలు పరచవలెను. 4) వేలం పాటను దక్కించుకొన్న హక్కుదారుడు మూడు నెలల హెచ్చుపాటను అడ్వాన్స్ చెల్లించవలెను. నెలసరి కిస్తులు సక్రమంగా చెల్లించని యెడల డిపాజిట్లు మొత్తము పురపాలక సంఘ నిధులకు జమచేసుకొని గెజిట్ నిబంధనలకు లోబడి చర్యలు చేపట్టబడును. 5) లీజుదారుడు గెజిట్ రేట్ల మేరకు సుంకము వసూలు చేయవలెను అట్లుగాక ఎక్కువ రేట్లు వసూలు చేసిన యెడల లీజును రద్దు పరచి తిరిగి వేలం నిర్వహించబడును. 6) మార్కెట్ ఏరియాలో పారిశుద్ధ్య పనులకు నియమించిన స్వీపర్ల నెలసరి జీత భత్యములు గుత్త దారులే భరించవలెను మరియు నెలసరి కిస్తుతో సహా స్వీపర్ల జీత భత్యములు కలిపి పై లీజు షరతుల మేరకు చెల్లించవలెను. గెజిట్‌లోని 43 వ పేరా మేరకు స్వీపర్ల జీత భత్యములు మొత్తము చెల్లించవలెను. అందుకుగాను అతని జీత భత్యములో 1/4వ వంతు మరియు 12వ క్లాజు చూపిన ధరావత్తు మొత్తములో కలిపి ధరావత్తుగా చెల్లించవలయును. 7) వేలం పాటకు అదనంగా పాటదారుడు 18% జి.యస్.టి. చెల్లించి ఉత్తర్వులు పొందిన 7 రోజులలో నిబంధనల మేరకు అగ్రిమెంట్‌ను Registration చేయించవలెను. ఆ విధముగా Registration చేయించని యెడల హెచ్చుపాటను రద్దు చేయు అధికారము మున్సిపల్ కమిషనరు, హిందూపురం వారికి కలదు.

సం/- కమిషనర్, హిందూపురం పురపాలక సంఘం

పటిష్ట భద్రత మధ్య బ్యాలెట్ బాక్సుల తరలింపు


బ్యాలెట్ బాక్సులు ఉంచిన కంటైనర్‌కు సీలు వేస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: స్థానిక చిన్నపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన బ్యాలెట్ బాక్సులను పటిష్ట భద్రత మధ్య అనంతపురానికి తరలించారు. సోమవారం జరిగిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికలకు సంబంధించి రాత్రి 12 గంటల వరకూ బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్‌కు రూంకు తరలించడంలో అధికారులు తలమునకలయ్యారు. మంగళవారం ఉదయం పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, డీఎస్పీ డాక్టర్ యశ్వంత్ సమక్షంలో స్ట్రాంగ్ రూంలను తెరచి అందులోని బ్యాలెట్ బాక్సులను కంటైనర్లలోకి ఎక్కించి, అనంతపురంలోని జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలకు తరలించారు.

స్వల్పకాలిక శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

లేపాక్షి: ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం కింద అందజేస్తున్న స్వల్పకాలిక శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు లేపాక్షిలోని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ బద్రీనాథ్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డొమెస్టిక్ ఎలక్ట్రికల్ సొల్యూషన్స్, అసిస్టెంట్ సర్వేయర్ కోర్సుల్లో 3 నెలలు పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. పదో తరగతి పాస్/ఫెయిల్ అయి, 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయసున్న వారు అర్హులు. ఆసక్తి ఉన్నవారు http://pmkvy.skillindia.gov.in వెబ్‌సైట్ ద్వారా లేదా, స్వయంగా 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్, మెయిల్ ఐడీ, ఆధార్‌తో అనుసంధానం చేసిన ఫోన్ నంబర్‌తో కూడిన దరఖాస్తులను అందజేయాలి. పూర్తి వివరాలకు 82971 70834, 94414 29697, 63020 25591లో సంప్రదించవచ్చు.

గుర్తు తెలియని వృద్ధురాలి ఆత్మహత్య

సోమందేపల్లి : మండలంలోని చాకర్లపల్లి రైల్వే గేటుకు రెండు వందల మీటర్ల దూరంలో రైలు పట్టాలపై మంగళవారం రాత్రి గుర్తు తెలియని వృద్ధురాలి (60) మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ బాలాజీ నాయక్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం లభ్యమైన తీరును బట్టి ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. కాగా, మృతురాలి వద్ద చాలకూరు నుంచి సోమందేపల్లికి బస్సులో ప్రయాణం చేసినట్లుగా టికెట్ లభ్యమైంది. రెండు చేతులపై పచ్చబొట్టు ఉంది. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని హిందూపురం రైల్వే పోలీసులు కోరారు.

ప్రేమ పేరుతో వంచన

- విశాఖ వాసికి రిమాండ్


పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు చంద్రమౌళి

పుట్టపర్తి: ప్రేమ పేరుతో అమ్మాయిలకు గాలం వేసి, వారి ఫొటోలు, వీడియోలు తీసి మార్ఫింగ్ చేస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న విశాఖపట్నానికి చెందిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను బుక్కపట్నం ఎస్‌ఐ నరసింహుడు మంగళవారం వెల్లడించారు. పుట్టపర్తి నియోజకవర్గానికి చెందిన ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎస్పీ యశ్వంత్ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు విశాఖపట్నం ప్రాంతానికి చెందిన చంద్రమౌళిని సోమవారం అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తాను చేసిన నేరాలను నిందితుడు అంగీకరించాడు. చంద్రమౌళికి ఇదివరకే వివాహమైంది. కళాశాల విద్యార్థినులు పలువురిని ప్రేమ పేరుతో నమ్మించి, వారికి తెలియకుండా ఫొటోలు, వీడియోలు తీసి అసభ్యకరమైన చిత్రాలతో మార్ఫింగ్ చేసేవాడు. అనంతరం వాటిని విద్యార్థినులకు చూపి బ్లాక్‌మెయిల్ చేసేవాడు. కొన్నేళ్లుగా హైదరాబాద్, వైజాగ్, కర్ణాటక తదితర ప్రాంతాల్లో ఈ తరహా మోసాలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో నిందితుడి ఉచ్చులో చిక్కుకున్న పుట్టపర్తి నియోజకవర్గానికి చెందిన యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడి అసలు బాగోతం వెలుగు చూసింది. విచారణ అనంతరం మంగళవారం నిందితుడిని అరెస్ట్ చూపి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

దంపతులపై టీడీపీ నేతల దాడి


చికిత్స పొందుతున్న రామ్మోహన్‌రెడ్డి, నాగరత్నమ్మ

బత్తలపల్లి: రస్తా వివాదంలో టీడీపీ నేతలు విచక్షణ మరిచి దంపతులపై దాడికి తెగబడ్డారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన దంపతులు ఆస్పత్రి పాలయ్యారు. పోలీసులు తెలిపిన మేరకు.. పోట్లమర్రి గ్రామంలో హనుమంతరెడ్డి ఇంటి వద్ద నుంచి ప్రధాన రహదారి వరకూ సీసీ రోడ్డు మంజూరైంది. దీంతో మంగళవారం సచివాలయ ఇంజినీర్ అక్కడకు చేరుకుని కొలతలు తీస్తుండగా రోడ్డు సమీపంలో నివాసముంటున్న టీడీపీ నేత ఈడిగ ఓబులేసుతో పాటు ఆయన అనుచరులు ఇద్దరు అడ్డుకున్నారు. దీంతో స్థానికంగా ఉంటున్న వైఎస్సార్‌సీపీ నేత రామ్మోహన్‌రెడ్డి అక్కడకు చేరుకుని సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చెలరేగి రామ్మోహన్‌రెడ్డిపై ఓబులేసుతో పాటు ఇద్దరు అనుచరులు దాడికి తెగబడ్డారు. విషయాన్ని గమనించిన రామ్మోహన్‌రెడ్డి భార్య నాగరత్నమ్మ అక్కడకు చేరుకుని తన భర్తను కాపాడుకునే ప్రయత్నం చేయడంతో ఆమెపై కూడా దాడి చేశారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన రామ్మోహన్‌రెడ్డి, నాగరత్నమ్మను స్థానికులు ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష తెలిపారు. కాగా, దాడి విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, నాయకుడు హనుమంతరెడ్డి తదితరులు ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు.

తమ్ముడూ.. నీ తీరేమీ బాగోలేదు

- నియోజకవర్గ టీడీపీ మాజీ ఎమ్మెల్యేను హెచ్చరించిన చంద్రబాబు?

పెనుకొండ: 'పార్టీని గెలిపించాలనుకుంటున్నారా? ఓడించాలనుకుంటున్నారా? స్పష్టంగా చెప్పండి. తమ్ముడూ... నీ తీరు బాగోలేదు. మార్చుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి' అంటూ పెనుకొండ నియోజకవర్గ టీడీపీ మాజీ ఎమ్మెల్యేను ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు తీవ్రంగా హెచ్చరించారు. ఈ అంశం కాస్త నియోజకవర్గ టీడీపీ నేతలకు తెలియడంతో మంగళవారం పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం... పోల్ మేనేజ్‌మెంట్.. ఇతర ఖర్చులకు దాదాపు రూ.కోటి మేర నిధులు పంపితే కనీసం రూ.25 లక్షలు కూడా ఖర్చు చేయకుండా డబ్బును దాచుకున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే తీరుపై అధిష్టానానికి పలువురు ఫిర్యాదు చేశారు. ఎన్నికల ఫండ్‌లో ఏకంగా రూ.70 లక్షలకు పైగా దాచుకుని పార్టీ శ్రేణులకు రిక్త హస్తం చూపడంతో ప్రచారంలో పార్టీ కేడర్ చేతులెత్తేసింది. అలాగే ఓ మహిళా నాయకురాలు సైతం ఒక రోజు ముందే వచ్చిన డబ్బును బూత్ ఖర్చులకు, ఇతర అవసరాలకు ఇవ్వకుండా దాచుకోవడం కూడా వివాదాస్పదమైనట్లు తెలిసింది. పోలింగ్ రోజు కనీసం తాగునీరు కూడా ఇవ్వకపోవడంతో తాము పడిన ఇబ్బందులను పార్టీ ఏజెంట్లతో పాటు పలువురు టీడీపీ నాయకులు నేరుగా ఫోన్ ద్వారా పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దీంతో మాజీ ఎమ్మెల్యేతో పాటు మహిళా నాయకురాలుపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

కియా ఉద్యోగి దుర్మరణం


మృతుడు సుదర్శన్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కపట్నం మండలం చిలకలగడ్డపల్లికి చెందిన లక్ష్మీనారాయణ రెడ్డి కుమారుడు సుదర్శన్‌రెడ్డి (32) పెనుకొండ సమీపంలో ని కియా ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం సొంత పనిపై ద్విచక్ర వాహనంలో ధర్మవరానికి బయలుదేరిన సుదర్శనరెడ్డి... బుక్కపట్నం చెరువు కట్టపై కొడిమిగుట్ట వద్దకు చేరుకోగానే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జైంది. సుదర్శన రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని మృతుడిని చూసి బోరున విలపించారు. మృతుడికి భార్య, ఓ కుమార్తె ఉన్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతో సహా ఉడాయించాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు కొత్తచెరువు ఎస్‌ఐ లింగన్న తెలిపారు.

స్టాఫ్‌నర్సుల నియామకాల్లో మాయాజాలం

కొంత మంది అడ్డదారుల్లో ఉద్యోగాలు పొందడానికి బరి తెగిస్తున్నారు. వారికి కొందరు సహకరిస్తున్నారు. దీంతో అర్హులైన వారికి అన్యాయం జరుగుతోంది. ఇటీవల జరిగిన కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నియామకాల్లో పలువురు బోగస్ మార్కుల జాబితాతో మెరిట్ సాధించి ఉద్యోగాలు పొందారు. తాజాగా ఈ వ్యవహారం వెలుగుచూడటంతో వైద్య, ఆరోగ్యశాఖలో అలజడి నెలకొంది.

- బోగస్ మార్కుల జాబితాతో ఉద్యోగాలు
- ఇప్పటి వరకు 8 మందివి నకిలీ సర్టిఫికెట్లుగా నిర్ధారణ


కడపలోని వైద్య, ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం

కడప రూరల్: కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నియామకానికి ప్రభుత్వం గత ఏడాది నవంబరులో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఉద్యోగాలకు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధి (జోన్-4)లో దాదాపు 12,000 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో రాయలసీమ వ్యాప్తంగా అభ్యర్థులు ఉన్నారు. ఈ ఏడాది జనవరిలో స్టాఫ్ నర్సుల నియామక ప్రక్రియను కడపలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించారు. మెరిట్ ప్రాతిపదికన మొత్తం 291 మందికి ఉద్యోగ అవకాశం కల్పించారు. ఈ ఉద్యోగాలకు ఇంటర్మీడియెట్ తర్వాత నాలుగేళ్ల స్టాఫ్ నర్సు కోర్సు లేదా బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన వారు అర్హులు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలో ఈ కోర్సులకు గుర్తింపు ఉంటుంది. అంటే ఈ యూనివర్సిటీ వారు జారీ చేసిన మార్కుల జాబితాతో పాటు ఇతర సర్టిఫికెట్లను ప్రామాణికంగా తీసుకుంటారు. అత్యధిక మార్కుల ప్రాతిపదికన స్టాఫ్ నర్సు నియామకాలు చేపట్టారు. దీన్ని గమనించిన కొంత మంది అభ్యర్థులు ఏకంగా బోగస్ మార్కుల జాబితాను సృష్టించి ఉద్యోగాలు పొందారు.

అనుమానంతో తీగ లాగడంతో...

ఈ వ్యవహారమంతా దాదాపు చిత్తూరు జిల్లా కేంద్రంగా జరిగింది. ఆ జిల్లాకు చెందిన రిటైర్డ్ పోలీసు అధికారి కుమార్తెకు స్టాఫ్ నర్సు ఉద్యోగం రాలేదు. తన కుమార్తెకు మార్కుల పరంగా మెరిట్‌లో ఉన్నప్పటికీ ఉద్యోగం రాకపోవడంతో అనుమానించారు. దాదాపు 15 మందిపై దృష్టి సారించారు. వారిపై కడపలోని వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్‌తోపాటు డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీకి ఫిర్యాదు చేశారు. అందులో కొన్ని బోగస్ మార్కుల జాబితాలు ఉన్నట్లు హెల్త్ యూనివర్సిటీ వారు నిర్ధారించారు. కాగా... వారికి ఉద్యోగ నియామక పత్రాలను ఇచ్చేముందు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ కౌన్సెలింగ్‌లోనూ అధికారులు నకిలీ మార్కుల జాబితాలను కనిపెట్టలేకపోయారు.

వారు వీరేనా?

చిత్తూరు జిల్లాలో కోవిడ్ సమయంలో స్టాఫ్ నర్సుల నియామకాలను విరివిగా చేపట్టారు. ఆ సందర్భంగా కొంత మంది వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అభ్యర్థులకు తక్కువ మార్కులు ఉన్నా ఎక్కువ ఉన్నట్లుగా సృష్టించి కాంట్రాక్టు నర్సులుగా నియమించారు. అప్పట్లో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. అలా నాడు బోగస్ మార్కుల జాబితాను పొందిన వారిలో కొంత మంది తాజాగా చేపట్టిన స్టాఫ్ నర్సు నియామకాల్లో ఉద్యోగాలు సాధించినట్లు వినికిడి. ఈ అంశంపై లోతుగా విచారణ చేస్తే మరి కొంత మంది బయటపడతారని ఆ శాఖ ఉద్యోగులు భావిస్తున్నారు.

చట్టపరమైన చర్యలు

15 మంది అభ్యర్థులు బోగస్ మార్కుల జాబితాలు పొందినట్లుగా మా దృష్టికి వచ్చింది. ఆ వివరాలను డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీకి, డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ వారికి పంపాము. వారిలో 8 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు బోగస్ అని యూనివర్సిటీ వారు నిర్ధారించారు. వారిలో ఐదుగురు వైద్య విధాన పరిషత్‌లో, ఇద్దరు డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ ఆధ్వర్యంలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఒక అభ్యర్థికి ఉద్యోగం రాలేదు. అక్రమాలకు పాల్పడే వారు ఎవరైనా సరే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కోటేశ్వరి, వైద్య, ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్